క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న డాక్టర్ రాజశ్రీ

రాజానగరం: వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నియోజకవర్గంలోని 41 మందికి మంజూరైన రూ.15.16 లక్షల చెక్కులను గురువారం పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ రాజమహేంద్రవరంలోని స్వగృహం వద్ద లబ్ధిదారులకు వీటిని అందజేశారు. ఇంతవరకూ నియోజకవర్గంలోని మూడు మండలాలలో 1,153 మందికి రూ.9.53 కోట్ల సీఎంఆర్‌ఎఫ్ సాయం అందించినట్టు ఆమె తెలిపారు.

రైతు కూలీల ప్రదర్శన



రాజానగరంలో ప్రదర్శన చేస్తున్న రైతు కూలీలు

రాజానగరం: ఢిల్లీలో జరిగిన రైతుల ఉద్యమానికి మద్దతుగా అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో రాజానగరంలో గురువారం ప్రదర్శన నిర్వహించారు. ఉద్యమ సమయంలో రైతులకు ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్నదాన సత్రం నుంచి గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా బస్టాండ్ వరకూ ప్రదర్శన సాగింది. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్, జిల్లా అధ్యక్షుడు జె.సత్తిబాబు, డివిజన్ నాయకులు మరుకుర్తి వీరలక్ష్మి, బులిశెట్టి సత్యవతి పాల్గొన్నారు.

రైతు ఉద్యమంపై మొండి వైఖరి విడనాడాలి

పెదపూడి: రైతాంగ ఉద్యమంపై ప్రధాని మోదీ మొండివైఖరిని విడనాడాలని ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజుబాబు అన్నారు. స్థానిక కైకవోలు సెంటర్లో ఏపీఆర్‌సీఎస్, భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఛలో ఢిల్లీలో భాగంగా ధర్నా చేపట్టామన్నారు. మద్దతు ధరల గ్యారంటీ చట్టం తేవాలని, రైతుల రుణాలను మాఫీ చేయాలని, ఆహార భద్రత చట్టాన్ని ప్రతిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు మడికి సత్యం, ఎల్లే సత్తిబాబు, వి.సత్తిబాబు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

శివకృష్ణకు జ్యోతిష శిరోమణి బిరుదు ప్రదానం

ప్రకాశం నగర్: నగరానికి చెందిన జ్యోతిష పండితుడు ఎస్‌వైబీఎస్ శివకృష్ణ జ్యోతిష శిరోమణి బిరుదు అందుకున్నారు. హైదరాబాద్‌లో గురువారం ఎస్ఎస్ లైవ్ ఆస్ట్రో సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ జ్యోతిషుడు నరసింహస్వామి ఆయనకు బిరుదు ప్రదానం చేశారు. జ్యోతిషంలో అనేక పరిశోధనలు చేస్తున్న శివకృష్ణ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు.

ఏఆర్‌టీ సెంటర్ల తనిఖీలు

కంబాలచెరువు: ఏఆర్‌టీ క్లినిక్, లెవెల్ 2, ఏఆర్‌టీ బ్యాంకుల అనుమతికి దరఖాస్తు చేసుకున్న కేంద్రాలను జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గైనకాలజీ నిపుణులున్న ఆస్పత్రులు ఏఆర్‌టీ క్లినిక్‌లకు దరఖాస్తు తీసుకోవచ్చన్నారు. అనధికారికంగా ఏఆర్‌టీ క్లినిక్ నడుపుతుంటే వెంటనే మూసివేస్తామన్నారు. హాస్పిటల్‌లో ఈ సెంటర్ నిర్వహణకు ప్రభుత్వం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న ఏఆర్‌టీ కేంద్రాలను ఇన్‌స్పెక్షన్ టీం వచ్చి రికార్డులను పరిశీలించిందన్నారు. ఇన్‌స్పెక్షన్ టీం కమిటీ మెంబర్లు డాక్టర్ అక్కమాంబ, పాథాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నజీర్, చిన్న పిల్లల నిపుణులు డాక్టర్ ఝాన్సీ, డిప్యూటీ డీఈఎంవో సత్యకుమారి, ఎంపీహెచ్ఎస్ ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహోన్నతుడు కారల్ మార్క్స్

ప్రకాశం నగర్: మానవ చరిత్రను మలుపుతిప్పిన మహోన్నతుడు కారల్ మార్క్స్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కారల్ మార్క్స్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, సహాయ కార్యదర్శి సప్ప రమణ పాల్గొన్నారు.

సీపీఎం కార్యాలయంలో..

శ్యామల సెంటర్ సమీపంలోని సీపీఎం కార్యాలయంలో మార్క్స్ చిత్రపటానికి ఆ పార్టీ సీనియర్ నాయకుడు టీఎస్ ప్రకాష్, జిల్లా కార్యదర్శి టి.అరుణ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పి.తులసి, బి.పవన్, రాజులోవ పాల్గొన్నారు.

పోషణ సంపూర్ణం.. చక్కని ఆరోగ్యం..

- అంగన్‌వాడీ కేంద్రాల్లో పక్షోత్సవాలు
- చిరుధాన్యాల ఉపయోగాలపై అవగాహన

మధురపూడి: రేపటి తరాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ పోషకాహారాన్ని అందిస్తోంది. దానిలో భాగంగా మార్చి 9 నుంచి 23 వతేదీ వరకూ పక్షోత్సవాన్ని నిర్వహిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారం, వాటి ఉపయోగాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నారు. తక్కువ ఖర్చుతో పోషకాహారాన్ని తయారు చేసుకోవడాన్ని తెలియజేస్తున్నారు. కోరుకొండ సీడీపీఓ పరిధిలో ఉన్న కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాల్లో 228 వరకూ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో 11,133 మంది చిన్నారులు, 1,133 మంది గర్భిణులు, 1,331 మంది బాలింతలు ఉన్నారు.

23 వరకూ పక్షోత్సవాలు

ఐసీడీఎస్‌కు చెందిన అంగన్‌వాడీ కేంద్రాల్లోని టీచర్లు, ఆయాలు ఈనెల 9వ తేదీ నుంచి 23 వరకూ పౌష్టికాహార పక్షోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా చిన్నారులు, వారి తల్లులకు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాలను జరుపుతున్నారు. రాగులు, జొన్నలు, గంటి, కొర్రలు, గోధుమ తదితర చిరుధాన్యాలతో పోషకాలు అధికంగా అందుతాయి. రోగనిరోధక



చిరుధాన్యాలతో తయారు చేసిన పదార్థాల ప్రదర్శన

శక్తి పెరుగుతుంది. ఆకుకూరలు ఎక్కువగా తినడం వల్ల హిమోగ్లోబిన్ శాతం పెరుగుతుంది. ఇలా చిరుధాన్యాలు, ఆకుకూరల వల్ల కలిగే ప్రయోజనాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నారు.

సంపూర్ణ పోషణ

భవిష్యత్తు తరాలను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పోషకాహారంతో పాటు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందిస్తోంది. ఈ పక్షోత్సవంలో ఇప్పటివరకూ 60 శాతం మందికి వీటిని పంపిణీ చేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లో రెండున్నర కేజీల సోడిపిండి, రెండున్నర కేజీల అటుకులు, పావుకేజీ బెల్లం, పావుకేజీ వేరుశనగ అచ్చులు, పావుకేజీ కర్జూరం, 25 కోడి గుడ్లు, 5 లీటర్ల పాలు ఉంటాయి. అలాగే ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలకు నెలకు 25 కోడి గుడ్లు, రెండున్నర లీటర్ల పాలు, రెండున్నర కేజీల బాలామృతం ఇస్తున్నారు.



కోరుకొండ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలతో సిబ్బంది

క్రమం తప్పకుండా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్నాం. చిన్నారులకు బాలామృతం, గుడ్లు, పాలు, గర్భిణులు, బాలింతలకు మూడు కేజీల బియ్యం, కేజీ కంది పప్పు, అర లీటర్ నూనె కూడా అందిస్తున్నాం. వీటిని ప్రతినెలా మొదటి, మూడవ శుక్రవారాల్లో పంపిణీ చేస్తున్నాం.

– ఝాన్సీరాణి, సీడీపీఓ, ఐసీడీఎస్ కోరుకొండ

వసతుల కల్పన



రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందిస్తోంది. గర్భిణులు, బాలింతల సంపూర్ణ ఆరోగ్యం కోసం అన్ని చర్యలు తీసుకుంటోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్ని వసతులు కల్పించారు.

– ముదే సిందూ దివ్య, సర్పంచ్, కోటికేశవరం

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



బిక్కవోలులో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం బిక్కవోలు గ్రామంలో సచివాలయం-3 భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పనుల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు, జన్మభూమి కమిటీల వద్ద పడిగాపులు కాసే వారన్నారు. నేడు జగనన్న ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా పథకాలు ఇంటి వద్దే అందిస్తున్నారన్నారు. అవినీతితో కళ్లు మూసుకుపోయిన టీడీపీ నాయకులకు రాష్ట్రంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి కానరావడం లేదని విమర్శించారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగనన్న అని కొనియాడారు. ఎవరి వల్ల అభివృద్ధి సాధ్యమైందో రానున్న ఎన్నికల్లో ప్రజలే నిర్ణయిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సరెళ్ల సుమలత, వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు, వైఎస్సార్ సీపీ నాయకులు గువ్వల సత్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక ప్రయోజనాలే ప్రభుత్వ లక్ష్యం



పెదపర్తిలో సచివాలయ భవన సముదాయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- పెదపర్తిలో అభివృద్ధి పనుల ప్రారంభం

అనపర్తి: ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పెదపర్తిలో రూ. 67.54 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవన సముదాయాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అవినీతి రహిత పాలన, అర్హులకే సంక్షేమ పథకాలు అందించడం ద్వారా గాంధీ కలలుకన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తెచ్చారన్నారు. సచివాలయాల ద్వారా ప్రజలకు సత్వర, మెరుగైన, పారదర్శక సేవలు అందుతున్నాయన్నారు. కుల, మత, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల సేవలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆదరించి, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయాన్ని అందించాలని కోరారు. తొలుత రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవన సముదాయాన్ని, రూ.23.94 లక్షలతో నిర్మించిన ఆర్బీకే సెంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే, గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి వెంకటరెడ్డి, సర్పంచ్ నల్లమిల్లి కాంతమ్మ అమ్మిరెడ్డి, ఎంపీటీసీ తలమంపూడి మణి సత్యనారాయణరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, పంచాయతీ పాలక మండలి సభ్యులు, గ్రామ ప్రముఖులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం



కోటికేశవరంలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- నియోజకవర్గంలో 1,286 మందికి పట్టాల పంపిణీ

మధురపూడి: నియోజకవర్గంలో పేదల సొంతింటి కల సాకారమైందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. నియోజకవర్గంలోని కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాల్లో 1,286 మంది లబ్ధిదారులకు గురువారం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాజా సుడిగాలి పర్యటన చేశారు. కోరుకొండ మండలం దోసకాయలపల్లిలో 255 మంది, గాడాలలో 230 మందికి, జంబూపట్నంలో 45 మందికి, శ్రీరంగపట్నంలో 250 మందికి, కోటికేశవరంలో 145 మందికి, సీతానగరం మండలం చీపురుపల్లిలో 30 మందికి, పెద్ద కొండేపూడిలో 60 మందికి, రాజానగరం మండలం ముక్కినాడలో 91 మందికి, తూర్పుగానుగూడెంలో 180 మందికి పట్టాలను అందజేశారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దాదాపు 99 శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కు దక్కుతుందన్నారు. సుమారు రూ.2.70 లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారన్నారు. ఆయన ప్రోత్సాహంతో రాజానగరం నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే 20,178 మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. దానిలో భాగంగానే గురువారం 1,286 మందికి అందించామన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజల జీవన స్థితిగతుల్లో మార్పు చోటుచేసుకుందని, ప్రజలకు కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం 650 హామీలిచ్చి, ఒక్క హామీని కూడా అమలు జరపలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుపై ఓటేసి సీఎంగా జగన్‌ను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు.



మల్టీపర్పస్ గోడౌన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజా

మల్టీపర్పస్ గోడౌన్ ప్రారంభం

కోటికేశవరంలో మల్టీపర్స్ గోడౌన్‌ను గురువారం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పంటలను నిల్వ చేసుకునేందుకు ఈ గోడౌన్లు ఉపయోగపడతాయన్నారు. ఇప్పటికే రాజానగరం, శ్రీరంగపట్నం గ్రామాల్లో మల్టీపర్పస్ గోడౌన్లను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం కోసమే విలేజ్ క్లినిక్‌లు

- వెంకటాపురంలో ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. వెంకటాపురం గ్రామంలో రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన విలేజ్ క్లినిక్ భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విలేజ్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు సొంత ఊర్లోనే వైద్య సేవలు అందుబాటులో వస్తాయన్నారు. చిన్న జబ్బులకు మండల కేంద్రాల్లోని పీహెచ్‌సీలకు వెళ్లనవసరం ఉండదన్నారు. ఈ క్లినిక్‌లో 12 రకాల వైద్య సేవలతో పాటు, 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. 65 రకాల మందులు, 67 రకాల వైద్య పరికరాలను అందుబాటులో ఉంచామన్నారు. ఏఎన్ఎంలు 24 గంటలూ అందుబాటులో ఉంటారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ క్లినిక్‌లు, వీటికి సొంత భవనాలు నిర్మించామన్నారు. అనంతరం క్లినిక్ నిర్మాణానికి స్థలం అందించిన దాతలు ముంగి అబ్బులు, అనంతలక్ష్మి దంపతులను ఎమ్మెల్యే సత్కరించారు.

పాస్టర్ల కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయింపు

క్రైస్తవులకు ప్రాధాన్యమిచ్చి, గుర్తించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వెంకటాపురంలోని పారడైజ్ ప్రేయర్ హౌస్ చర్చిలో బుధవారం మండల పాస్టర్ల ఫెలోషిప్ సర్వసభ్య సమావేశం పాస్టర్ స్వర్ణనరాజు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రైస్తవులపై దాడులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అరికట్టిందన్నారు. క్రైస్తవులకు అన్ని రకాల సహకారాలు అందిస్తామన్నారు. మండల పాస్టర్ల ఫెలోషిప్ సభ్యులకు వడిశలేరు గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఐదు సెంట్ల భూమి కేటాయించామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో పాస్టర్లందరూ వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు, మండల క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు కుసుమంచి కృష్ణంరాజు, మండల పాస్టర్ల సంఘం సెక్రటరీ కొల్లాటి రత్నబాబు, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, సర్పంచ్ ముంగి గంగరాజు, పార్టీ కన్వీనర్ మాగాపు వెంకటరమణ, ఎంపీటీసీ ఎస్.చిట్టిబాబు, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు మంగిన రాంబాబు, బూత్ కమిటీ సభ్యుడు విజయబాబు పాల్గొన్నారు.



వెంకటాపురంలో విలేజ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

వలంటీర్లను గౌరవించడం అందరి బాధ్యత

రంగంపేట: ప్రజలకు అన్నివేళలా అండగా ఉంటున్న వలంటీర్లను గౌరవించుకోవడం అందరి బాధ్యత అని ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో వలంటీర్ల వందనం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ వలంటీర్ల కృషి కారణంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు సులువుగా ప్రజలకు చేరువ అవుతున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 95 శాతం మంది లబ్ధి పొందుతున్నారని చెప్పారు. వలంటీర్లు అవినీతి రహితంగా సంక్షేమ ఫలాలు అందజేశారన్నారు. పేదల పక్షపాతిగా ఉన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్రకు ఎంపికైన వలంటీర్లను సత్కరించి, నగదు బహుమతిని అందించారు. జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు, రాష్ట్ర చేనేత, రైతు విభాగాల కార్యదర్శులు పాలాటి నాగేశ్వరరావు, రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఫ్యాన్‌కు ఓటేసి.. సంక్షేమాన్ని కాపాడుకుందాం

ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి

బిక్కవోలు: రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధిని కాపాడుకోవడానికి ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి అన్నారు. గురువారం ఆమె ఇళ్లపల్లి, ఇళ్లపల్లి పాకలు ప్రాంతాల్లో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఆమె మాట్లాడుతూ ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. పేదలందరికీ ఇళ్లు ఉండాలన్న ఉద్దేశంతో ఇళ్ల సల్తాలు అందించారని చెప్పారు. మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలంటే రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుకే వేసి.. ఎమ్మెల్యేగా డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాసరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లోల్లం భద్రరావు, ఎంపీటీసీ స్వర్ణలత, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, నాయకులు సాధనాలు రాంబాబు, పాలికల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఇళ్లపల్లిలో ఆదిలక్ష్మికి స్వాగతం పలుకుతున్న మహిళ

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు




విజేత రాజమహేంద్రవరం జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఓఎన్‌జీసీ అసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాంతానుదాస్

రాజమహేంద్రవరం రూరల్: చదువుతో పాటు క్రీడలలో రాణించడం ద్వారా ప్రతి ఒక్కరికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఓఎన్‌జీసీ రాజమహేంద్రవరం ఎసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాంతానుదాస్ అన్నారు. రోటరీక్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా గురువారం ఓఎన్‌జీసీ మైదానంలో జరిగిన ఫైనల్స్‌లో కాకినాడ, రాజమహేంద్రవరం జట్లు తలపడ్డాయి. తుదిపోరులో కాకినాడపై రాజమహేంద్రవరం విజయం సాధించింది. అనంతరం విజేతలకు శాంతానుదాస్ చేతుల మీదుగా ట్రోఫీ అందజేశారు. ఐకాన్స్ క్లబ్ అధ్యక్షుడు తీగెల రాజా మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించిన శాంతానుదాస్, టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన సీనియర్ కోచ్ శ్రీహరి, ఇతర కోచ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. టోర్నమెంట్‌కు స్పాన్సర్‌గా వ్యవహరించిన కమల్ గ్లాస్ యాజమాన్యాన్ని, సహకరించిన వారందరిని ఐకాన్స్ తరపున సత్కరించారు. క్రీడాకారులకు భోజనం ఏర్పాట్లు చేసిన ఇస్కాన్ డైరెక్టర్ శ్యామన్ శ్రీనివాస్‌దాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రోగ్రాం చైర్మన్ మద్దూరి శంకర్ ఈ టోర్నమెంట్‌కు ఆయన తండ్రి స్వర్గీయ నాగభూషణం జ్ఞాపకార్థం ప్రధాన స్పాన్సర్ చేశారు. క్లబ్ సెక్రటరీ అనుకుమార్, టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగంపై సదస్సు

ధవళేశ్వరం: ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ కేఎన్ జ్యోతి అన్నారు. ధవళేశ్వరం స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో గురువారం ట్రస్ట్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జ్యోతి మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేలా అనేక సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. దివ్యాంగులు, నడవలేని వృద్ధులు బీఎల్‌వోలను సంప్రదించి, ఇంటి దగ్గరే ఓటు హక్కు వినియోగించుకునే సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డీడీ సందీప్, డీడీఆర్‌సీ సుధాకర్, సన్యాసిరావు, సోమ, రంగమణి పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోతి

రైల్వేస్టేషన్ అడ్వైజరీ కమిటీ సభ్యుల నియామకం



నియామక ఉత్తర్వులు అందుకుంటున్న అడ్వైజరీ కమిటీ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక ప్రధాన రైల్వే స్టేషన్ అడ్వైజరీ కమిటీ సభ్యులుగా బీజేపీకి చెందిన ఏడుగురిని నియమిస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు గురువారం స్టేషన్ మేనేజర్ రంగనాథ్, సీటీఐ చంద్రమౌళీ చేతుల కమిటీ సభ్యులైన యానాపు ఏసు, చింతపల్లి సతీష్, బండి సత్యప్రసాద్, పోతురాజు సుబ్రహ్మణ్యం, భోజి హరికృష్ణ, వెలిశెట్టి రామకృష్ణ, ముచ్చా పరశురామ్‌లకు ఉత్తర్వులు అందించారు. అనంతరం ఆ సభ్యులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి పార్టీ కార్యాలయంలో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌తో పాటు గోదావరి, నిడదవోలు, అనపర్తి స్టేషన్లకు కూడా ఆయా మండలాల పరిధిలోని బీజేపీ నాయకులు అడ్వైజరీ కమిటీ సభ్యులుగా నియమితులయ్యారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బూరా రామచంద్రరావు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరామ్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కందికొండ రమేశ్, స్వచ్ఛ భారత్ సెల్ జిల్లా కన్వీనర్ కొల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం

రాజమహేంద్రవరం రూరల్: గర్భిణులు పోషకాహారం సక్రమంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిస్తారని మాజీ ఎంపీటీసీ నయనాల వరపద్మ మంగతాయారు అన్నారు. పోషన్ పక్వాడా పక్షోత్సవాలలో భాగంగా బొమ్మూరులోని అంగనవాడీ కేంద్రం -3లో గురువారం గర్భిణులకు సీమంతం, ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువ కలిగిన ఆహారం తయారు చేసుకునే విధానాన్ని వివరించారు.